

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- అధికారులైతే సస్పెన్షన్, సేవల నుంచి తొలగింపు
- కాంట్రాక్టర్లయితే టెండర్ల రద్దు
- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి
- పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క
- సమీక్షకు హాజరుకాని ఆర్అండ్బీ అధికారులపై ఆగ్రహం



కొత్తగూడలో అధికారులతో మాట్లాడుతున్న సీతక్క

కొత్తగూడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ, గంగారం మండలాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క హెచ్చరించారు. అధికారులైతే సస్పెండ్, రిమూవ్ ఫ్రమ్ సర్వీస్, కాంట్రాక్టర్‌లు అయితే టెండర్‌లు రద్దు చేస్తామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశానికి హాజరుకాని ఆర్అండ్బీ అధికారులపై సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడలోని రైతు వేదికలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారుల నుంచి నివేదిక అడిగి మంత్రి తెలుసుకున్నారు. రెండు మండలాల్లో బీటీ రోడ్లు, వంతెనలు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు మొదలు పెట్టకపోవడంతో పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. వర్షకాలం లోపు రోడ్ల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్‌లు పనులు చేయకపోతే టెండర్‌లు రద్దు చేయాలని హెచ్చరించారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ఊళ్లల్లో పర్యటించి గ్రామాలలోని తాగునీటి సమస్యలు మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ఆర్అండ్బీ శాఖ నుంచి ఏఈఈ ఒక్కరే హాజరుకావడంతో డీఈ ఎందుకు రాలేదని ఏఈఈని సీతక్క ప్రశ్నించారు. గుంజేడు రోడ్డుపై బీటీ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. వెంటనే బీటీ పనులు మొదలు పెట్టేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలన్నారు. పీఆర్, ఐటీడీఏ, ఆర్అండ్బీ శాఖల అధికారులు పనులు చేయని కాంట్రాక్టర్‌లను గుర్తించి టెండర్‌లు రద్దు చేసి, మళ్లీ టెండర్‌లు పిలవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ పరిశీలించాలని సీడీపీవోను ఆదేశించారు. ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు మండలాల్లోని ఆస్పత్రులలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు తెలుపాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ఏజెన్సీలో డ్రగ్స్, గంజాయి రవాణా, వాడకంపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో మధుసుదన రాజు, డీపీవో హరిప్రసాద్, పీఆర్ ఎస్ఈ అజయ్‌కుమార్, ఈఈ విద్యాసాగర్, విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్, ఎంపీడీవోలు రవీంద్రప్రసాద్, అప్పారావు, డీహెచ్ ఎస్వో మరియన్న, తహసీల్దారు రమాదేవి, ఏపీఎం శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

హడావుడి చేశారు.. ప్రారంభం మరిచారు..!

- నెలలు గడుస్తున్నా తెరుచుకోని మహిళా 'శక్తి క్యాంటీన్లు'
- రెండు మండలాల్లోనే ప్రారంభం
- మిగతా చోట్ల ఎదురుచూపులే!
- ఆదాయం లేకుండానే అప్పులకు ఈఎంఐల చెల్లింపులు
- అప్పుల ఊబిలోకి వెళ్లనున్న మహిళలు



కేసముద్రం మార్కెట్ ఆవరణలో నెలన్నర క్రితమే ప్రారంభానికి సిద్ధమైన మహిళా శక్తి క్యాంటిన్

కేసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి పథకం (ఐఎంఎస్ఎస్) కింద ఏర్పాటు చేయనున్న 'మహిళా శక్తి క్యాంటిన్ల'ను ప్రారంభించడంలో ఆలస్యమవుతోండడంతో మహిళలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. మహిళలకు చేయూతనిస్తూ ఆర్థిక స్వావలంభన సాధించి, వారిని లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా ఈ క్యాంటిన్లను ఏర్పాటు చేస్తున్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళా శక్తి క్యాంటిన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయించింది. మహిళా శక్తి క్యాంటిన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలని, దేశానికే ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ సర్కార్ ఈ పథకాన్ని రూపొందించింది. మునిసిపాలిటీ ప్రాంతాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), ఇతర ప్రాంతాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) పర్యవేక్షణలో ఈ క్యాంటిన్లను మహిళలతో ఏర్పాటు చేయించారు.

ప్రతిష్టాత్మకంగా పది ఏర్పాటు..

మహబూబాబాద్ జిల్లాలో మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటులో మొదటి దశలో వివిధ మండలాల్లో పది వరకు క్యాంటిన్లను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ఆవరణ, కోర్టు, జిల్లా కలెక్టరేట్ ప్రాంతాలతో పాటు కేసముద్రం, డోర్నకల్, కొత్తగూడ, గూడూరు, తొర్రూరు, మరిపెడ మండల కేంద్రాల్లో ఒకటి చొప్పున మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంటిన్‌కు పూచీకత్తు లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు మహిళలు రుణం తీసుకొని ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్యాంటీన్లను నిర్వహిస్తూ తమ పూర్తి రుణాన్ని వాయిదాల రూపంలో వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో మహబూబాబాద్, డోర్నకల్ మండలాల్లో ఏర్పాటు చేసిన క్యాంటిన్లను రెండురోజుల క్రితమే ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించారు. మిగతా క్యాంటిన్లు ప్రారంభించకుండా అలాగే ఉండిపోయాయి.

కొన్నింటిని ప్రారంభించారు..

మంత్రులు, రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులతో మహిళా శక్తి క్యాంటీన్లను అట్టహాసంగా ప్రారంభించేందుకు అధికారులు హడావుడిగా మహిళలతో ఏర్పాటు చేయించారు. మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతాల్లోని నాలుగు క్యాంటిన్లను మూడురోజుల క్రితం ఎమ్మెల్యేలచే ప్రారంభించారు. మిగిలిన మండలాల్లో ప్రారంభానికి ఎదురుచూస్తున్నారు. క్యాంటిన్ ఏర్పాటుకు అనుకూలంగా లేనిచోట గదులను మహిళలు తమ సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. ముందు భాగంలో టీస్టాల్, వంట చేసేందుకు సిమెంటుతో గద్దెలను నిర్మించారు. హోటల్‌కు రంగులు, పేరు సూచించే బోర్డు, అడుగుభాగంలో కార్పెట్ తదితర ఏర్పాట్లు చేసుకున్నారు. హోటల్ నిర్వహణకు అవసరమయ్యే గ్యాస్‌పొయ్యిలు, వంటగిన్నెలు, ఫ్రిడ్జ్ తదితర వస్తువులను కొనుగోలు చేశారు. కేసముద్రంలో ఈ క్యాంటిన్ ప్రారంభానికి సిద్ధమై నెలన్నర కావస్తుండగా.. మిగతా మండలాల్లో నెల రోజులు కావస్తోంది. ఈ రుణాలకు ఇప్పటికే కొన్ని చోట్ల సమానమైన నెలవారి వాయిదా (ఈఎంఐ) చెల్లింపులు కూడా చేశారు. క్యాంటిన్లను ఏర్పాటు చేయించి ప్రారంభించకుండా జాప్యం చేస్తోండడంతో ఆదాయం లేక అప్పులకు అసలు, వడ్డీలు చెల్లిస్తుండడంతో మహిళలు అప్పుల ఊబిలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే అన్ని క్యాంటిన్లను ప్రారంభించి మహిళ శక్తిక్యాంటిన్ల లక్ష్యాన్ని నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు కోరుతున్నారు.



విలేకరుల సమావేశంలో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ

నేడు నిట్ స్నాతకోత్సవం

- 22వ సంబురానికి ఏర్పాట్లు పూర్తి
- హాజరవనున్న డిఫెన్స్ డైరెక్టరేట్ సెక్రెటరీ డాక్టర్ సమీర్ వి కామత్
- 1875 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- వివరాలు వెల్లడించిన నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ

5

రామప్పకు కేంద్రం 'ప్రత్యేక' నిధులు

'రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం' కింద రూ.73.74 కోట్లు మంజూరు



హనుమకొండ, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక, యునెస్కో గుర్తింపు పొందిన అద్భుత పురాతన కట్టడం రామప్పకు కేంద్రప్రభుత్వం రూ.73.74 కోట్లను మంజూరు చేసింది. రామప్పతో పాటు దానిని ఆనుకొని ఉన్న ఇతర చూడదగ్గ ప్రాంతాల సుస్థిర పర్యాటక ప్రాంత సర్క్యూట్‌కు గాను ప్రభుత్వం ఈ నిధులను ఇచ్చింది. కొవిడ్ సంక్షోభ సమయంలో మూలవ్యయం కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం' కింద ఈ నిధులు మంజూరు అవగా.. ఈ సొమ్ములతో రామప్ప దానిచుట్టు పక్కల ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఈ నిధులను ఖర్చు చేస్తారు. 23 రాష్ట్రాల్లోని 40 ప్రధాన పర్యాటక ప్రాంతాలకు మొత్తం రూ.3,295.76 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో భాగంగా తెలంగాణలో రామప్పతోపాటు నల్లమల ప్రాంతంలో ఉన్న సోమశిలకు నిధులను కేటాయించింది. సోమశిల వెల్‌నెస్ అండ్ స్పిర్చువల్ రిట్రీట్ పేర రూ.68.10 కోట్లను ఇచ్చింది. ఈ ప్రత్యేక సహాయం కింద ప్రతీ రాష్ట్రంలో రెండేసి దర్శనీయ స్థలాలను ఎంపిక చేసి నిధులను విడుదల చేసింది.

వరికోత మిషన్ కిందపడి వ్యక్తి మృతి

- మరిపెడ మండలం గుండెపుడిలో ఘటన
- మృతుడు తమిళనాడు రాష్ట్రం మధురై వాసి

మరిపెడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరికోత మిషన్ (హార్వేస్టర్) కింద పడిన ఓవ్యక్తి మృతి చెందిన ఘటన గుండెపుడిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం. తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లాకు చెందిన సత్తిరాజు (42) అనే డ్రైవర్ హార్వేస్టర్ కింద నిద్రిస్తున్నారు. అది గమనించని మరో డ్రైవర్ ఏమరపాటున నడపడంతో సత్తిరాజు తలపై నుంచి వరికోత మిషన్ వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. హార్వేస్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన దీక్షా దివస్

- కేసీఆర్ దీక్ష, పట్టుదల, పోరాటాలతో స్వరాష్ట్ర సాధన
- దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వర్‌రావు



మానుకోట బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న కొండబాల కోటేశ్వర్‌రావు

మహబూబాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాటి స్వరాష్ట్ర ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2009 నవంబరు 29న చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష (దీక్షా దివస్) తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిందని దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వర్‌రావు అన్నారు. మానుకోటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. ముందుగా తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి, స్వరాష్ట్ర ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. 2001లో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా కేసీఆర్ నాయకత్వంలో నాటి టీఆర్ఎస్, నేటి బీఆర్ఎస్ ఆవిర్భవించిందని చెప్పారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆమరణ దీక్షతో దిగివచ్చిన నాటి యూపీఏ ప్రభుత్వం డిసెంబరు 9న తెలంగాణకు అనుకూల ప్రకటన చేసిందని తెలిపారు. ఆ తర్వాత సమైక్య వాదుల కుట్రలతో డిసెంబరు 23న మరో ప్రకటన చేస్తూ శ్రీకృష్ణ కమిటీని వేశారని గుర్తు చేశారు. ఆ నాటి నుంచి తెలంగాణ ఏర్పాటు వరకు సకల జనులను ఉద్యమంలో భాగస్వాములు చేసిన కేసీఆర్ తనదీక్ష, పట్టుదల, రాజకీయ చతురతతో స్వరాష్ట్రాన్ని సాధించారని తెలిపారు.

సకల జనులను ఏకం చేసిన కేసీఆర్..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత

తెలంగాణ ఉద్యమ సమయంలో యావత్ తెలంగాణ నాలుగున్నర కోట్ల సకల జనులను ఏకం చేసిన మహోన్నత వ్యక్తి బీఆర్ఎస్ అధినేత, ప్రస్తుత మాజీ సీఎం కేసీఆర్ అని పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత అన్నారు. 14 ఏళ్ల పోరాటంలో యావత్ తెలంగాణ ప్రజలను ఏకం చేసి, స్వరాష్ట్రం సాధించారని చెప్పారు. డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ కేసీఆర్ పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని చెప్పారు. మానుకోట మాజీఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌మాట్లాడుతూ తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా కేసీఆర్ తెలంగాణ కోసందీక్ష చేపట్టారని చెప్పారు.అనంతరం స్వరాష్ట్ర పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆం గోతు బిందు, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, బానోత్ రవికుమార్, ఎమ్డీ.ఫరీద్, గుడిపుడి నవీన్‌రావు, ఎర్రబెల్లి మాధవి, వెంకట్‌రెడ్డి, ఆకుల జగ్గయ్య, మంగలంపల్లి శ్రీనివాస్, అయూబ్‌పాష, బూర్ల ప్రభాకర్, ఎడ్ల వేణు, తేళ్ల శ్రీను, మంగలంపల్లి కన్న, పెద్ది సైదులు, దర్శనం రామకృష్ణ, నీలేష్‌రాయ్ పాల్గొన్నారు.



హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



విదేశీ విద్యాపథకం స్కాలర్‌షిప్ కోసం

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అల్పసంఖ్యాక వర్గాల వారు విదేశాలల్లో విద్యనభ్యసించేందుకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా డిసెంబరు 1 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బి.శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్, వైద్యవిద్య కోసం అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, సౌత్‌కొరియా దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించుటకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు1, 2024 నుంచి డిసెంబరు 31, 2024 కాలంలో ప్రవేశాలు పొందిన అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సెల్ నెంబర్ : 73966 91373, 98859 83942లను సంప్రదించాలని ఆయన అన్నారు

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



అనంతారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అందరికీ అన్నం పెట్టే రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని అనంతారం, గాంధీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని విజ్ఞప్తి చేశారు. అన్నదాత బాగు కోసం సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను తీసుకువస్తున్నారని చెప్పారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నారని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జనవరి మాసం నుంచి నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఏవో తిరుపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాష, కోడి శ్రీను,ఎడ్ల రమేష్, చలమల నారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.




బహుమతి ప్రదానం చేస్తున్న డీఎం పద్మావతి

తొర్రూరు ఆర్టీసీ డిపోలో వనభోజనాలు

తొర్రూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు శుక్రవారం తొర్రూరు డిపోలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ పద్మావతి మాట్లాడుతూ డిపోలో పని చేస్తున్న కార్మికులందరూ ఒకే చోట చేరి, వనభోజనాలను నిర్వహించుకున్నామన్నారు. కార్మికుల్లో ఐక్యత భావం, సిబ్బంది ఒకేచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొందని తెలిపారు. కార్పొరేషన్ కార్మికుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆర్టీసీ కార్మికులు వారి కుటుంబసభ్యులతో కలిసి అక్కడికి చేరి ఆటపాటలతో ఎంతో ఉత్సాహంగా గడిపారన్నారు. కార్మికుల కుటుంబసభ్యులకు పలు ఈవెంట్‌ల్లో పోటీ లు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ రజిత, ఎంఎఫ్ కుమార్, ఆర్టీసీ యూనియన్ నాయకులు ఎంకే రావ్, ఆర్ఎస్ కుమార్, జేవై గిరి, మల్లికార్జున్, కేవీ రెడ్డి, వెంకటయ్య, కార్మికులు ఉన్నారు.

ఘనంగా దీపోత్సవం



ఆలయంలో సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహదేవపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల ఆదేశాల ప్రకారం కార్తీక మాసం శుక్రవారం సామూహిక దీపోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు టీ.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భక్తులతో సామూహిక దీపోత్సవాన్ని చేపట్టారు. 500 మంది భక్తులు, శ్రీరాజరాజేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు, అన్నమాచార్య సేవా సమితి సభ్యులు దీపాల అలంకరణలో పాల్గొన్నారు. మహిళలకు దీపాలు, వత్తులు, నూనె, ఇతర పూజా సామగ్రిని ఆలయం నుంచే ఉచితంగా అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళల రద్దీ

- బస్సులు లేక భక్తుల ఇక్కట్లు



కాళేశ్వరం బస్టాండ్‌లో నెలకొన్న భక్తుల రద్దీ

మహదేవపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమ గోదావరి నదీ తీరాన ఉన్న కాళేశ్వర పుణ్యక్షేత్రానికి కార్తీక శుక్రవారం ఒక్కసారిగా భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం దగ్గర పడుతుండడంతో పెద్ద ఎత్తున మహిళా భక్తులు స్వామివారి సన్నిధికి వచ్చారు. కాని భక్తులకు తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల కొద్ది వేచి ఉండడమే కాకుండా బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు ఇదే రద్దీ కొనసాగింది. బస్సుల కోసం జనం పడరాని పాట్లు పడ్డారు.

ఫుడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు : కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లో జరుగుతున్న వరస ఘటనల దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ రాహుల్‌శర్మ జిల్లాలోని వసతి గృహాల్లో ఆహార నాణ్యతను పరిశీలించేందుకు ఫుడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటుచేశారు. వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీల్లో ఆహార నాణ్యతను పరిశీలించేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం కలెక్టర్ రాహుల్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి డివిజన్‌కు స్థానికసంస్థల కలెక్టర్, ఆర్డీఓ, డీఎస్ఓ, డీపీఓ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో కమిటీ ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. కాటారం రెవెన్యూ డివిజన్ పరిధిలో అదనపు కలెక్టర్(రెవెన్యూ), డీఎం, ఎస్సీ వెల్ఫేర్ అధికారి, సహకార అధికారి, మైనార్టీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో కమిటీలు వేసినట్లు తెలిపారు. మండలస్థాయిల్లో మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవోలతో కమిటీ వేసినట్లు చెప్పారు. వసతి గృహాల్లో, పాఠశాలల్లో కమిటీలు తనిఖీలుచేస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించారు.

ములుగు జిల్లాలో అభివృద్ధి వెలుగులు

- త్వరలో జిల్లాకేంద్రం మునిసిపాలిటీగా ఏర్పాటు
- రూ.3కోట్లతో బస్టాండు నిర్మాణం
- మల్లంపల్లి మండలంతో మాట నిలుపుకున్నాం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ములుగులో ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో ములుగు జిల్లాను ప్రగతి వైపు పరుగులు పెట్టిస్తున్నామని, అభివృద్ధి వెలుగులతో వెనుకబాటును దూరం చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా శుక్రవారం ములుగులో ప్రజలు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డీఎల్ఆర్ గార్డెన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తూ ప్రజాపాలన సాగిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గ్రామాల్లో పర్యటిస్తూ జనం అవసరాలను తెలుసుకుంటున్నారన్నారు. అందరి సహకారంతో ప్రజా ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుందని, ఆర్థిక సమస్యలను అధిగమిస్తూనే అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిరంతరం అమలుచేస్తున్నామన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడటం కాంగ్రెస్ నైజమని, 25 రోజుల వ్యవధిలో రూ.18వేల కోట్ల రైతు రుణాలను మాఫీచేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలుపుకున్నామన్నారు. 30వ తేదీన మరో 3లక్షల మందికి కూడా రుణమాఫీ జరుగుతోందని తెలిపారు. పదేండ్లలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి నిరుద్యోగాన్ని పెంచితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వరుస నోటిఫికేషన్లతో వేలాది మందికి ఉద్యోగాలిస్తోందన్నారు. ఒక్క ములుగు జిల్లాలోనే 180మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలిచ్చామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని నోటిఫికేషన్‌లు ఇచ్చి ఉద్యోగాలిస్తామని స్పష్టం చేశారు. పేదలకు ధైర్యం కలిగించే పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామని, ఇది ఓర్వలేని విపక్షాలు ప్రజాప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. మాటిస్తే మడమతిప్పని నేత రేవంత్‌రెడ్డి అని, టీపీసీసీ అధ్యక్షునిగా మేడారం సమ్మక్క, సారలమ్మ సన్నిధి నుంచి పాదయాత్ర మొదలుపెట్టిన ఆనాడు ప్రజలకిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేశారని తెలిపారు. త్వరలో ములుగు మునిసిపాలిటీగా అవిర్భవిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో కేంద్రం రామప్ప టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి రూ.73కోట్లను మంజూరు చేసిందని వెల్లడించారు. రూ.3కోట్లతో జిల్లాకేంద్రంలో ఆర్టీసీ బస్టాండును నిర్మించనున్నట్లు తెలిపారు. సమ్మక్క, సారలమ్మ జాతరను సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని, ములుగులో సమీకృత మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. జిల్లాకు 3500 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరయ్యాయని, ఇందిరమ్మ కమిటీల ద్వారా పేదలకు అందజేస్తామన్నారు. అంతడుపుల నాగరాజు కళాబృందం ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్‌లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోతు రవిచందర్, ఆర్డీవో వెంకటేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీపీఆర్‌వో రఫిక్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

- భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

గణపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలకు మరింత చేరువ అయ్యేలా విధులు నిర్వర్తించాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, విధుల నిర్వహణ, కేసుల నమోదు, కేసుల పరిష్కారం, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ సంబంధిత చర్యల విషయమై ఎస్సై అశోక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు, రైటర్ రూమ్, లాకప్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలను పలుమార్లు సందర్శించాలని, దొంగతనాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. సీసీ కెమరాల ఏర్పాటుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. డీసీసీ బ్యాంక్ పరిసరాలను సందర్శించి బ్యాంక్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్, సీసీ ఫసియుద్దీన్‌లు ఉన్నారు.

రైస్ మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

జనగామ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ అధికారులు మండలంలోని దేవి ఆగ్రో, మహేశ్వర ఆగ్రో, హరిహర ఆగ్రో ఇండస్ట్రీస్‌ను శుక్రవారం తనిఖీ నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు ధాన్యం నిలువలను తనిఖీ చేపట్టి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ మాట్లాడుతూ 2022-23, 2023-24, 2024-25 సీజన్‌లకు సంబంధించిన ధాన్యం నిల్వలను సంబంధిత రికార్డుల ద్వారా సరి చేయడం జరిగిందన్నారు. మిల్లుల్లో ఎటువంటి వ్యత్యాసం లేదన్నారు. ఇండస్ట్రీ యజమానులు తప్పకుండా ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించాలన్నారు. తనిఖీలలో సివిల్ సప్లయ్ డీటీ ఇట్టబోయిన శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ బాలు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట: బచ్చన్నపేటకు చెందిన లక్ష్మీశ్రీనివాస ఆగ్రో ఇండస్ట్రీస్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మిల్లులో ఉన్న ధాన్యం నిలువలను పరిశీలించారు. 2022 నుండి ఇప్పటి వరకు సీజన్ల వారీగా ధాన్యం నిలువలకు సంబంధించిన రికార్డులు తనిఖీలు చేశారు. కార్యక్రమంలో డీటీ సివిల్ సప్లయ్ శ్రీనివాస్, టీఏ బాలు పాల్గొన్నారు.



జనగామలోని రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ప్రజాపాలన ఉత్సవాలను విజయవంతం చేయాలి : జనగామ కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1 నుంచి 9వరకు నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టర్ జిల్లా అధికారులు, మండల, గ్రామ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో విజయోత్సవాలు, మధ్యాహ్న భోజనం, సీఎం కప్‌పై టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ విజయోత్సవాల్లో భాగంగా అన్ని మండల కార్యాలయాల్లో ప్రభుత్వ లోగోను ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయాలు పరిశుభ్రత పాటించాలని, విద్యుత్ దీపాలను అలకరించాలన్నారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో గ్రామ స్థాయి, 10, 11 తేదీల్లో మండల స్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో సీఎం కప్ పోటీలను నిర్వహించాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించాలన్నారు.

మండల స్థాయిలో ఆహార భద్రత పర్యవేక్షణ కమిటీలను నియమించాలని, ఈ కమిటీలో ఎంఈవో, హెచ్‌ఎం, ఎంపీడీవో, తహసీల్దార్ ఉంటారన్నారు. వీరు నిత్యం పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించాలన్నారు. ఎక్కడైనా మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు మరమ్మతులో ఉంటే వాటి పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలన్నారు.

ఆర్టీసీ డిపోలో కార్తీక వనభోజనాలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డిపోలో శుక్రవారం కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులు వారి జీవిత భాగస్వాములు కార్తీక వనభోజనాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం శివప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డిపోలో కార్తీక వనభోజనాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది శ్రీమన్నారాయణ శ్రీనివాస్, పాపిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో వనభోజన కార్యక్రమంలో డీఎం శివప్రసాద్, ఉద్యోగులు

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- అందులో భాగంగానే మెస్‌చార్జీల పెంపు
- రాజకీయం కోసం విద్యార్థులను బలి తీసుకునేందుకు బీఆర్ఎస్ యత్నం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



కొత్తగూడలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని.. అందులో భాగంగానే గురుకులాలు, పాఠశాలలోని విద్యార్థులు బాగుండాలని కాంగ్రెస్ సర్కార్ మెస్ చార్జీలు పెంచిందని పంచాయతీ రాజ్, స్త్రీ, శిశుసంక్షేమ శాఖమంత్రి సీతక్క పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అయితే మెస్‌చార్జీలు పెంచిన నాటి నుంచి గురుకులాల్లో, పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయన్నారు. తప్పుడు ప్రచారంతో బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నదన్నారు. హాస్టళ్లు, గురుకులాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు, సిబ్బంది బీఆర్ఎస్ నాయకులకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. రాజకీయ ఉనికి కోసం విద్యార్థులను బలి తీసుకునేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, నేడు ఆందోళనలు చేసేలా బీఆర్ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. కొత్తగూడ, గంగారం రెండు మండలాల అభివృద్ధికి నిధుల కేటాయించామన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ఒక్క ఇళ్లు కూడా నిర్మించలేదని ఆరోపించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు త్వరలో నిర్మిస్తామన్నారు. ఉచిత బస్సు పథకం పెడితే బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వజ్జ సారయ్య, రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, మాజీ జడ్పీటీసీలు పుల్సం పుష్పలత, కారోజు రమేష్, కందిమల్ల మధుసుదన్‌రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, ఏఎంసీ డైరెక్టర్ బొల్లు రమేష్, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, రాజేశ్వర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు షురూ

- మొదటి రోజు 23 మంది డీబార్

కేయూ క్యాంపస్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేయూ పరిధిలో శుక్రవారం డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి శుక్రవారం తెలిపారు. కాగా, మొదటి రోజు జరిగిన పరీక్షల్లో ఆదిలాబాద్ పరీక్షల కేంద్రంలో 23 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహాచారి తెలిపారు.

కేయూలో డ్రగ్ ఫ్రీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేయూ జాతీయ సేవా పథకం, స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ సంయుక్తంగా శుక్రవారం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో డ్రగ్ ఫ్రీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కేయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణలు గోడ పత్రికను ఆవిష్కరించారు.

ముగిసిన వర్సిటీ హాస్టల్స్ ప్రవేశాల ప్రక్రియ

కేయూ క్యాంపస్‌తో పాటు ఇతర హాస్టల్స్‌లో 2024-25 ఏడాదికి వర్సిటీ హాస్టల్స్‌లో శుక్రవారంతో ప్రవేశాలు ముగిసినట్లు కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో మొదటి, రెండో ఏడాది చదవుతున్న పీజీ విద్యార్థులు గమనించాలని కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



వీరన్న (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం గడ్డిగూడెం తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. గడ్డిగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతు దారావత్ వీరన్న(40)కు ఎకరం భూమి ఉంది. అందులో వరి పంటను సాగు చేశాడు. సాయంత్రం వ్యవసాయపనులు ముగించుకుని ఇంటికి వచ్చిన వీరన్న స్నానం చేసేందుకు వాటర్ హీటర్‌ను పెట్టాడు. నీరువేడిగా అయిన తర్వాత వాటర్‌హీటర్ తీస్తున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వీరన్నకు భార్య శాంతి, కుమారుడు నవీన్, కుమార్తె పూజా ఉన్నారు.

గుండెపోటుతో సెక్షన్ ఆఫీసర్..



లక్ష్మీనర్సు (ఫైల్)


తాడ్వాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం ములుగు జిల్లా తాడ్వాయి మండలకేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వజ్జ లక్ష్మీనర్సు(59) మధ్యాహ్నం తన స్వగ్రామంలో బాత్‌రూంకు వెళ్లగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి అక్కడే కుప్పకూలిపోయాడు. దీంతో గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి సీపీఆర్ చేశారు. అయినప్పటికీ వైద్యులు పరిశీలించి గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, భార్య మోకాళ్ల లక్ష్మి తాడ్వాయి ఆశ్రమ పాఠశాల వార్డెన్‌గా పని చేస్తున్నారు. లక్ష్మీనర్సు మృతి చెందడంతో మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హత్య కేసులో నిందితుల అరెస్టు

మహదేవపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రుపల్లిలో ఈ నెల 27న హత్య జరిగిన విషయం విదితమే.. కాగా కాళేశ్వరం పోలీసులు శుక్రవారం నిందితులు పొన్నం శివకృష్ణ, ఫయాజ్, సాయికిరణ్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. కాటారం డీఎస్పీ రాంచందర్‌రావు తెలిపిన ప్రకారం.. మంచిర్యాల జిల్లా కొమ్మెరకు చెందిన ముత్యాల శ్రీకాంత్ హార్వెస్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో శ్రీకాంత్‌కు పెద్దపల్లి జిల్లా చందనాపుర్‌కు చెందిన పవన్‌కు పరిచయమై స్నేహం పెరిగింది. ఈ క్రమంలో శ్రీకాంత్‌కు డబ్బులు అవసరమై తన మిత్రుడు పవన్ అక్క వద్ద రూ. లక్ష అప్పుగా తీసుకున్నాడు.. నిత్యం పవన్ అక్కతో శ్రీకాంత్ సంభాషించసాగాడు. అపార్థం చేసుకున్న పవన్ అక్క భర్త శివరామకృష్ణ శ్రీకాంత్‌ను పలుమార్లు హెచ్చరించాడు. అయినా ఫోన్ సంభాషణ సాగడంతో శివరామకృష్ణ శ్రీకాంత్‌ను హత్య చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. ఈ క్రమంలో శ్రీకాంత్ గ్రామానికి చెందిన కురుమ సాయికిరణ్ అనే వ్యక్తితో శివకృష్ణకు పరిచయం ఏర్పడింది.

శివరామకృష్ణ తన చిన్ననాటి స్నేహితుడు ఎండీ.ఫయాజ్‌తో కలిసి నెల 27న ఉదయం శ్రీకాంత్ గ్రామం కొమ్మెర వెళ్లి అతడి ఇంటి వద్ద చూశారు. శ్రీకాంత్ అక్కడ లేకపోవడంతో స్థానిక కిరాణషాపు వద్ద వివరాలు తెలుసుకున్నారు. మహదేవపూర్ మండలం అన్నారం శివారు చంద్రుపల్లి వద్ద ఉన్న శ్రీకాంత్ ఆచూకీ తెలుసుకుని సాయంత్రం వేళలో కారులో వెళుతున్న శ్రీకాంత్‌ను అడ్డగించి విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశారు. దీంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే నిందితులు అక్కడి నుండి పారిపోయి అడవిలో దుస్తువులు, కత్తులను తగులబెట్టి పారిపోయారు. పోలీసులు విచారణ జరుపుతుండగా శుక్రవారం చంద్రుపల్లి వైపు వెళుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

రామప్పను సందర్శించిన ట్రైయినీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు



శిల్పకళా సంపద గురించి వివరిస్తున్న గైడ్

వెంకటాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు లభించిన రామప్ప దేవాలయాన్ని శుక్రవారం ట్రైయినీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారిని సాదరంగా ఆహ్వానించగా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్ విజయ్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక ఎస్సై జక్కుల సతీష్, తదితరులు ఉన్నారు.

కోటగుళ్లలో భక్తుల సందడి

గణపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కట్టడమైన కోటగుళ్లలో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం చివరి శుక్రవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఏటా ఆనవాయితీగా వస్తున్న గోపూజను చేపట్టారు. స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహిచి తీర్థప్రసాదాలు అందజేశారు.



గోపూజ నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు నాగరాజు

కీర్తి పతాక

ఆనంద పారవశ్యం ఆలయ నృత్యం..

టెంపుల్ డ్యాన్స్‌తో ప్రతిభ చాటుతున్న హిమాన్సీ



- జాతీయస్థాయి గుర్తింపు సొంతం చేసుకున్న ఓరుగల్లు నాట్య కళాకారిణి
- వెండి తెరపైనా నాట్య సవ్వడులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ౧గణపురం కోటగుళ్లు.. ఓరుగల్లు రామప్ప.. జాకారం శివయ్య.. వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడు.. చారిత్రక ఉమ్మడి ఓరుగల్లు నేలపై అడుగడుగునా కొలువై ఉన్న దేవదేవుడు పరమేశ్వరుడా' అంటూ ఆనంద పారవశ్యంతో ౧ఆలయ నృత్యా' చేస్తూ తన నృత్యప్రయాణాన్ని కొనసాగిస్తోంది కాట్రగడ్డ హిమాన్సీ. హనుమకొండ బాలసముద్రం అడ్వకేట్స్ కాలనీకి చెందిన హిమాన్సీ. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన ఆలయాలు ముఖ్యంగా శిథిలావస్థలో ఉన్న ఆలయ ప్రాంగణాల్లో నృత్యం చేస్తూ వాటిని అందమైన వీడియోలు రూపొందించి తన యూట్యూబ్ చానల్ ద్వారా ఆ ఆలయాల పరిస్థితిని వెలుగులోకి తెస్తోంది. ప్రముఖ దర్శకుడు కళా తపస్వీ స్వర్గీయ విశ్వనాథ్, సిరివెన్నెల సీతారామశాస్త్రి లాంటి సినీ ప్రముఖుల ఆశీర్వచనం అందుకొన్న హిమాన్సీ మూడు సంవత్సరాలుగా తనదైన ప్రతిభతో తన టెంపుల్ డ్యాన్స్ స్కూల్ ద్వారా నృత్యంలో ఎదుగుతున్న కళాకారుణిలచే నృత్య సౌరభాలను గుబాళింజేస్తూ ఔరా అనిపిస్తోంది.

తండ్రి శ్రీనివాసరావుతో పాటు స్వతహాగా కళాకారిణి అయిన తల్లి శ్రీలక్ష్మి ఇచ్చిన ప్రోత్సాహంతో ప్రముఖ నాట్యాచార్యుడు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద నాట్య ఓనమాలు దిద్దిన హిమాన్సి. ఇప్పటి వరకు పలు జాతీయ, అంతర్జాతీయ వేడుకలపై 900కు పైగా ప్రదర్శనలు ఇచ్చి అతి పిన్న వయసులోనే లెక్కకు మిక్కిలి అవార్డులను, నగదు ప్రోత్సాహాలను సొంతం చేసుకుంది. ఎస్ఆర్ విశ్వవిద్యాలయం ద్వారా బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన హిమాన్సీ నాట్యంతో మక్కువతో 8వ ఏటే కాలికి గజ్జెకట్టి అరంగ్రేటం చేసింది. ఇటీవల లోకమందన్ 2024 పేరిట హైదరాబాద్ శిల్ప కళా వేదికలో భారత దేశ అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పాల్గొన్న వేడుకల్లో కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చి ఓరుగల్లు ఖ్యాతిని చాటింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో లెక్కకు మిక్కిలి ప్రదర్శనలు ఇచ్చింది. దేశంలోని అనేక నగరాల్లో నృత్య సౌరభాలు వెదజల్లింది. న్యూ ఢిల్లీలో నిర్వహించిన 75వ గణతంత్ర పరేడ్ వేడుకల్లో రాష్ట్రం నుంచి కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ద్వారా ఎంపికైన ఏకైక కూచిపూడి కళాకారిణిగా నృత్య ప్రదర్శన ఇచ్చింది.



కళాతపస్వి విశ్వనాథ్‌తో హిమాన్సీ (ఫైల్)



వెండి తెరపై చిన్నమ్మగా..

అంతేగాక నృత్య ప్రాధాన్యతగల సినిమాల్లో అవకాశాలను కూడా అందిపుచ్చుకొని కొన్ని సినిమాల్లోనూ కళాకారిణిగానే ప్రేక్షకులకు కనువిందు చేసింది. సూర్యాస్తమయం సినిమాతో పాటు కన్నడంలో నవిల కిన్నరి పేరిట నృత్య ప్రాధాన్యం గల సినిమాలో హీరోయిన్‌గా నటించి మెప్పు పొందింది. నందమూరి బాలకృష్ణ స్వీయ నిర్మాణంలో రూపొందించిన ఎన్టీఆర్ బయోపిక్‌లో పురందేశ్వరిగా అద్భుత నటనతో ప్రేక్షకుల మదిలో చిన్నమ్మగా ప్రత్యేక గుర్తింపు పొందింది.



శిష్యురాలితో ఆలయ నృత్యం చేయిస్తున్న హిమాన్సీ

రాజస్థాన్ పిల్లలతో నృత్యం చేయించి..

స్పెక్ మ్యాకే స్వచ్ఛంద సంస్థతో కలిసి భారతీయ కళలని భవిష్యత్ తరాలకు అందించాలన్న ఆశయంతో రాజస్థాన్‌లోని ఎంపిక చేసిన 15పాఠశాలల్లో హిమాన్సీ కూచిపూడి కళను పరిచయం చేస్తూ చిన్నారులతో నృత్యం చేయించి ప్రశంసలందుకుంది. అంతేగాక ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, చెన్నైలోని ఎస్ఎంఆర్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు కూచిపూడిలో నాట్యశిక్షణ ఇస్తోంది. నాట్యంతో పాటు సంగీతం, సాహిత్యం, వాయిద్యం కలగలిపి చిన్నారులకు శిక్షణ ఇస్తే మంచి భవిష్యత్ ఉంటుందని హిమాన్సీ ఆకాంక్షించారు. 25 వసంతాల హిమాన్సీ నాట్యమే ధ్యాసగా శ్వాసగా జీవిస్తూ ఇటీవల కార్తీక వేడుకల్లో వారాణసిలో అక్కడి ప్రభుత్వ అతిథిగా వెళ్లి తన నృత్య ప్రతిభతో ప్రశంసలందుకోవడం గర్వకారణం. 2019లో కాలికి గాయమై నాట్యానికి దూర మైన క్రమంలో వచ్చిన ఆలోచనల ప్రతిరూపమే టెంపుల్ డ్యాన్స్ అని, తన ఆలయ నృత్యం ద్వారా వెలుగులోకి వచ్చిన కొన్ని పురాతన ఆలయాలైనా అభివృద్ధి చెందితే తన నృత్యానికి ప్రాధాన్యం లభించినట్లేనని హిమాన్సీ అంటోంది. ముఖ్యంగా వరంగల్ జిల్లాలో నాట్యం పట్ల ఆసక్తి ఉన్న చిన్నారులందరికి నృత్యంలో శిక్షణ ఇస్తూ ఆలయ ప్రాంగణాల్లో వారితో అభినయింపజేయాలన్నదే తన ఆకాంక్ష అని హిమాన్సీ 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు.



ఏపీ జూనియర్ సివిల్ జడ్జిగా జనగామ బిడ్డ

- పేద కుటుంబం నుంచి వచ్చిన ముఖేష్‌కుమార్
- బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన కుటుంబం
- ముఖేష్ ఎంపికతో స్వగ్రామం సీతారాంపురంలో సంబరాలు

దేవరుప్పుల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలోని హైకోర్టు ఇటీవల జూనియర్ సివిల్ జడ్జీ ప్రొవిజనల్లీ సెలెక్షన్స్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. జూని యర్ డివిజన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాగా, జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం సీతారాంపురంనకు చెందిన పెండెం మనోహర్, భవానీల కుమారుడు ముఖేష్‌కుమార్ జూనియర్ సివిల్ జడ్జీగా ఎన్నికయ్యాడు. దాంతో స్వగ్రామంలో సంబరాలు చేసుకున్నారు. ముఖేష్ కుటుంబం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లినా ఆయన మాత్రం తరచూ స్వగ్రామానికి వచ్చి వెళ్లేవాడని గ్రామస్థులు చెబుతున్నారు.



ముఖేష్‌కుమార్‌తో తల్లిదండ్రులు మనోహర్, భవానీ

పేద కుటుంబం నుంచి..

ముఖేష్‌కుమార్‌ది పేద కుటుంబం. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ముఖేష్‌కుమార్ తండ్రి మనోహర్ అడ్డగుట్టలో హోటల్ నడిపించుకుంటూ సోషల్ వర్కర్‌గా ప్రజాసేవ చేసేవాడు. ప్రస్తుతం సివిల్ కాంట్రాక్టు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మనోహర్‌కు భార్య భవానీతో పాటు కుమారుడు ముఖేష్‌కుమార్, కూతురు శ్రావణి ఉన్నారు. కూతురు శ్రావణి న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో అనెస్థిషియాలో పీజీ చేస్తోంది.

సివిల్ సర్వీసెస్ ప్రిపరేషనే.. జడ్జిని చేసింది

పెండెం ముఖేష్‌కుమార్

బీటెక్ సివిల్ ఇంజనీర్ 2016లో పూర్తి చేశాక రెండేళ్లు సివిల్ సర్వీసెస్ ప్రిపేర్ అయ్యాను. హైకోర్టులో జడ్జీలు ఎలా అవుతారో తెలుసు కానీ, కింది కోర్టులో ఎలా అవుతారో తెలియదు. ఆ తర్వాత నెట్‌లో సర్చ్ చేశాను. లోయర్ కోర్టులో ఇలా కావచ్చా అనే ఆలోచించా. ఇది చాలా ఉత్తమమైన ఉద్యోగం అని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశాను. కష్టపడితే సాధించనిది ఏదీ లేదు.

వచ్చేనెలలో ఘన్‌పూర్‌కు సీఎం

- అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఏర్పాట్లు
- నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలబెడతా : కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్‌కు మంజూరైన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు డిసెంబరు చివరి వారంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వస్తారని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం ఘన్‌పూర్‌కు ప్రభుత్వం ద్వారా మంజూరైన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన స్థలాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కడియం పరిశీలించారు. అనంతరం సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఘన్‌పూర్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం రూ.45.50కోట్ల నిధులు మంజూరి ఇచ్చిందని, డిసెంబరు 15లోపు సంబంధిత అధికారులు డిజైన్, ఎస్టీమేషన్స్ పూర్తి చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ను జఫర్‌గడ్ మండలంలోని కోనాయిచలం గ్రామ పరిధిలోని 21ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.200 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఘన్‌పూర్‌లో రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ నిర్మాణానికి గాను ప్రభుత్వం రూ.26లక్షల నిధులు మంజూరి చేసిందని, అధికారులు డిజైన్‌ను పూర్తి చేసి టెండర్లు పిలువాలని సూచించారు. ఘన్‌పూర్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైందని, వచ్చే విద్యా సంవత్సరం తరగతులు జరుగుతాయన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను రైల్వే ఫైఓవర్ బ్రిడ్జి దిగువన గల స్థలంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్ ప్రధాన కాల్వ మరమ్మతుకు పనులకు నీటిపారుదల శాఖ నుంచి రూ.148.76 కోట్ల నిధులను ప్రభుత్వం 27న విడుదల చేసిందన్నారు.



ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ బాషా

రాష్ట్రంలోనే జనగామ జిల్లా ధాన్యం దిగుబడిలో టాప్‌లో నిలిచిందని కడియం తెలిపారు. కొందరు నేతలు నీచ స్థాయికి దిగజారి ధాన్యం కొనుగోళ్లు జరుగడంలేదని, రైతులకు ధాన్యం డబ్బులు పడడంలేదని, బోనస్ బోగస్ అని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీపీవో స్వరూప, ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, ఎస్పీడీసీఎల్ డీఈ రాంబాబు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, అంబటి కిషన్ రాజ్, నాగరబోయిన శ్రీరాములు, శిరీష్ రెడ్డి, కోతి రాములు, బూర్ల శంకర్, తెల్లాకుల రామకృష్ణ, చాడ రాజ్‌కుమార్, రజాక్ యాదవ్, గన్ను నర్సింహులు పాల్గొన్నారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

కాజీపేట జంక్షన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక శనివారం హనుమకొండకు రానున్నారు. స్థానిక హరిత కాకతీయ హోటల్‌లో జరిగే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ మహాసభలను జస్టిస్ నగేష్ భీమపాక ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, మహాసభల రిసెప్షన్ కమిటీ చైర్మన్ దుస్సా జనార్దన్ తెలిపారు.

నేత్రపర్వం.. రుద్రేశ్వరుడి కల్యాణం

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో కార్తీక మాస వేడుకలు చివరి అంకానికి చేరుకున్నాయి. శుక్రవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని నిత్య విధుల అనంతరం ఉత్తిష్ఠ గణపతికి ఆరాధన, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ నాట్యమండపంలో ప్రత్యేక వేదికపై ప్రముఖ వేదపండితులు కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుద్రేశ్వర కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య బాసికాధారణ, యజ్ఞోపవీతం, జిలకర్రబెల్లం, మంత్రసూత్ర మహాపఠనంతో పాదప్రక్షాళన, మాంగళ్యధారణ లాంటి ముఖ్య ఘట్టాలను పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజనుల మధ్య కోలాహలంగా నిర్వహించారు. గుజ్జా సంపత్‌రావు, సౌమ్య దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. అనంతరం నవగ్రహ రుద్రహోమం నిర్వహించారు. కల్యాణ వేడుకల అనంతరం స్వామి వారిని పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. కలకుంట్ల మేఘనాథచార్య, మణికంఠ శర్మ తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ పురాణ ప్రవచకులు రాంబట్ల షణ్ముఖచారి శివవిష్ణుతత్వంపై ధార్మిక ఉపన్యాసం నిర్వహించారు. సాయంత్రం ప్రదోశకాల పూజలో సీపీ అంబర్ కిషోర్ ఝా దంపతులు పాల్గొని పూజలు చేశారు.

నేడు పుష్పగిరి పీఠాధిపతి రాక

శనివారం సాయంత్రం పుష్పగిరి పీఠాధిపతి శ్రీవిద్యాశంకర భారతి స్వామి వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించి భక్తులకు అనుగ్రహ బాషణం చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఆదివారంతో కార్తీక మాస వేడుకలు పరిసమాప్తం కానున్నాయి.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు నిట్ స్నాతకోత్సవం

- 22వ సంబురానికి ఏర్పాట్లు పూర్తి
- హాజరవనున్న డిఫెన్స్ డైరెక్టరేట్ సెక్రెటరీ డాక్టర్ సమీర్ వి కామత్
- 1875 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- వివరాలు వెల్లడించిన నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ

హనుమకొండ, నవంబరు 29 ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూ ట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) కళాశాలలో శనివారం 22వ స్నాతకోత్సవం ఘనంగా జరగనుంది. క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా డిఫెన్స్ డైరెక్టరేట్ సెక్రెటరీ, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ హాజరు కానుండగా ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. సమీర్ వి కామత్ స్నాతకోత్సవ ప్రసంగం చేసిన అనంతరం విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం నిట్‌లోని సెనెట్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధీ వెల్లడించారు. అత్యున్నత ప్రమాణాలతో సాంకేతిక విద్యను అందిస్తున్న వరంగల్ నిట్‌కు అం తర్జాతీయ ఖ్యాతి ఉందని, అందుకే ఇక్కడ చదవడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఇష్టపడతారన్నారు. ఆ విశిష్టతను దృష్టిలో పెట్టుకొని స్నాతకోత్సవ నిర్వ హణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈసారి స్నాతకోత్సవంలో మొత్తం 1,875 మంది అభ్యర్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నామని, వీరిలో 147 మంది పీహెచ్‌డీ, 539 మంది ఎంటెక్, 154 మంది ఎంఎస్సీ, 949 మంది బీటెక్ గ్రహీతలున్నారని వివరించారు. వీరితో పాటు జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఎగ్జిట్ పాలసీ (ఎన్ఈపీ) కింద మరో 9 మంది పట్టాలు అందుకో బోతున్నారని తెలిపారు.



తొలిసారి రెండు ఎక్సలెన్స్ అవార్డులు

నిట్‌లో మొదటి సారిగా రెండు ఎక్సలెన్స్ అవార్డులను ప్రవేశపెట్టామని, ఇందులో ఒకటి పీజీలో టాప్‌గా నిలిచినవారికి ఇచ్చే అవార్డు, మరొకటి ఉత్తమ పీహెచ్ డీ థీసిస్‌కు గాను ఇచ్చే అవార్డు అని తెలిపారు. పీజీ ప్రోగ్రాంలో టాపర్‌గా నిలిచిన మనీషా వర్షిణి (ఎంసీఏ-కంప్యూటర్‌సైన్స్ ఇంజనీరింగ్), అరుణ్‌కుమార్ (కెమిస్ట్రీ) ఈ ఎక్సెలెన్సీ అవార్డుల కింద రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్‌కు ఎంపిక య్యారని ప్రొఫెసర్ సుబుధీ తెలిపారు. ఈ సంవత్సరం కాన్వోకేషన్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కి చెందిన మంజిమా కర్మాకర్ ఇన్‌స్టిట్యూట్ గోల్డ్ మెడల్‌ను అందుకోబోతున్నారన్నారు.

బంగారు పతకాల విజేతలు

ఈ సారి రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేతలుగా నిలిచిన ఎనిమిది మంది అభ్యర్థులు స్నాతకోత్సవంలో ముఖ్య అతిథి నుంచి బంగారు పతకాలను స్వీక రించనున్నారు. జగ్యసీ నవీన్ కమేష్ (సివిల్ ఇంజనీరింగ్), మంజిమా కర్మాకర్ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), అనిమేష్‌కుమార్ (మెకానికల్ ఇంజనీరింగ్), కోడూరు శ్రీచరణ్‌రెడ్డి (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికే షన్ ఇంజనీరింగ్), యల్లా ప్రతీక్(మెటల ర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్), శ్రీనివాస్ హేమన్ ధర్మవరం (కెమికల్ ఇంజనీరింగ్), రాలపల్లే కుమార్ చౌదరి(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్), జి.సంతోష్(బయోటెక్నాలజీ) వీరిలో ఉన్నారని వివరించారు. ఈ విలేకరుల సమావే శంలో నిట్ అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ ఏ శరత్‌బాబు పాల్గొన్నారు.

ఈ సారి మారిన స్నాతకోత్సవ వేదిక

నిట్‌లో శనివారం జరగనున్న 22వ స్నాతకోత్సవ వేదిక మారింది. ప్రతీ సారి క్యాంపస్ ఆడిటోరియంలో నిర్వహిస్తుండగా ఈసారి నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. 1500 మందికిపైగా కూర్చునేందుకు వీలున్న ఆడిటోరియంలో మరమ్మతు పనులు జరుగుతున్నందున ఆ పక్కనే ఉన్న అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో వేడుకను నిర్వహించాలని నిర్ణయించారు. లెర్నింగ్ సెంటర్‌లో సీటింగ్ కెపాసిటీ తక్కువైనా డిగ్రీలు తీసుకోవడానికి స్నాతకోత్సవానికి హాజరవుతున్న అభ్యర్థులందరికీ కూర్చునే ఏర్పాట్లు చేస్తున్నారు. మీడియా నుంచి పెద్ద సంఖ్యలో రానున్న దృష్ట్యా వారికి బయట నుంచే కవరేజ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సాంకేతికతను ప్రజలకు మరింత చేరువ చేస్తా

మంజిమ కర్మాకర్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్
ఇన్‌స్టిట్యూట్ గోల్డ్ మెడల్ విజేత



ప్రస్తుతం నేను టెలీకమ్యునికేషన్‌కు సంబంధించి సెమీ కండక్టర్లను తయారు చేసే కంపెనీ అయిన క్వాల్కంలో అసోసియేట్ ఇంజనీర్ (డిజైన్)గా పని చేస్తున్నా. వార్షిక సీజీపీఏ (ప్యాకేజీ) 17.40 లక్షలు. ఉద్యోగంలో మరింత రాణిస్తూ దేశాభివృద్ధికి దోహదపడేలా సాంకేతికతను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ఉన్నా.

మరింతగా రాణించడమే ధ్యేయం

మానిష వర్షిణి, మైక్రో సాఫ్ట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత (ఆల్ పీజీ ప్రోగ్రామ్స్)



మైక్రోసాఫ్ట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నా. నా సీజీపీఏ 9.62 లక్షలు. ఎంచుకున్న రంగంలో మరింత ఉన్నతంగా రాణించాలన్నది నా లక్ష్యం, అర్థవంతమైన మానవ సంబంధాలను కొనసాగించడం, ప్రజలకు ఉపయోగపడే రీతిలో సేవా కార్యక్రమాలు చేపట్టడం, వ్యక్తిగత వికాసం ద్వారా ఆనందంగా జీవించివృత్తిలో ఆదర్శంగానిలవాలన్నదే నాలక్ష్యం.

సైంటిస్టు కావాలని ఉంది

అరుణ్ కుమార్, కెమిస్ట్రీ
రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత (పీహెచ్‌డీ)



నిట్‌లోనే కెమిస్ట్రీ పీహెచ్‌డీ అయిపోయింది. ప్లేస్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నా. సైంటిస్టు కావాలన్నది నా లక్ష్యం. కెమిస్ట్రీలో ఇప్పటికే పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయి. అవన్నీ మానవ జీవన ప్రమాణాల మెరుగు లక్ష్యంగా సాగుతున్నవే. మారుతున్న జీవన స్థితిగతులపై రసాయన శాఖ ఆవిష్కరణల ప్రభావం ఎంతో ఉంది. ఆ దిశగా సరికొత్త పరిశోధనలు చేయాలన్నది నా ఆశయం.

బయోటెక్నాలజీలో కొత్త ఆవిష్కరణలకు కృషి

జి.సంతోష్, బయోటెక్నాలజీ
రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత

ఇంకా ఎక్కడా ప్లేస్‌మెంట్ తీసుకోలేదు. ఉన్నత చదువులు చదవాలని ఉన్నది. బయోటెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కర ణల కోసం పరిశోధనలు చేయాలని నా ఆశయం. భవిష్యత్తులో శాస్త్రవేత్తను కావాలనే ఆలోచన ఉంది. ఎంతో విస్తృతమైన బయోటెక్నాలజీ రంగంలో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. నా వంతుగా ఎంతో కొంత తోడ్పాటును అందించాలనుకుంటున్నా.





బోధనా రంగంవైపు వెళ్లాలని ఉంది

ఎల్లా ప్రతీక్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్
లోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత

ప్రస్తుతం నేను మద్రాస్ ఐఐటీలో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నాను. పీహెచ్‌డీ పూర్తయిన తర్వాత బోధనా రంగం వైపు వెళ్లాలని ఉన్నది. నాకు అకడెమిక్‌తో పాటు రిసెర్చ్ అంటే చాలా ఇష్టం. నా స్వస్థలం హైదరాబాద్. మా తల్లిదండ్రులు కూడా ఈ దిశగానే నన్ను ప్రోత్సహి స్తున్నారు. నిట్‌లో నేను చదివిన నాలుగేళ్ల కాలాన్ని మరువలేను. ఉన్నతంగా రాణించడానికి బలమైన పునాదులు ఇక్కడే పడ్డాయి.

మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉన్నతంగా ఎదగాలి

అనిమేష్ కుమార్, హెచ్‌పీసీఎల్‌లో మేనేజర్ (ఆపరేషన్)
రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత



భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లో మేనేజర్ (మేనేజ్‌మెంట్ ఆపరేషన్)గా పని చేస్తున్నాను. వార్షిక ప్యాకేజీ రూ. 20లక్షలు. స్వస్థలం పాట్నా. ఉద్యోగంలో కొనసాగుతూనే ఇంకా ఉన్నత చదువులు చదివి.. ఉన్నతంగా ఎదగా లని లక్ష్యంగా పెట్టుకున్నా. నిట్ నాకు దేవాలయం వంటిది. నా జీవ న సాఫల్యతలో చుక్కానిగా దోహదపడింది.

ప్రజలకు లబ్ధి చేకూరే పరిశోధనలు నా ప్రణాళిక

శ్రీనివాస్ హేమన్ ధర్మవరం, కెమికల్ ఇంజనీరింగ్
రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత



కేయర్ అయిల్ అండ్ గ్యాస్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నా. వార్షిక ప్యాకేజీ రూ.14 లక్షలు. ప్రస్తుతం నేను పనిచేస్తున్న కంపెనీలో ఉన్నత స్థాయికి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నా. ఆయిల్ అండ్ గ్యాస్ రంగంతో ప్రజలకు విడదీయరాని బంధం ఉంటుంది. ఈ రంగం ద్వారా వారికి మరింత లబ్ధి చేకూరే పరిశోధనలు చేపట్టాలన్నది నా ప్రణాళిక.

ప్రజోపయోగ పరిశోధనలు నా లక్ష్యం

రాళ్లపల్లె కుమార్ చౌదరి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేత



గోల్డ్‌మెన్ ఫ్యాక్స్ కంపెనీలో క్వాంటమ్ అనలిస్టుగా పనిచేస్తున్నా.ఉద్యోగంలో రాణించడంతో పాటు చదివిన చదువుకు సార్థకత చేకూరేలా ప్రజోపయోగమైన కార్యక్రమాలను, పరిశోధనలను చేయాలన్నది నా ఆశయం. ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టా. కంప్యూటర్ అండ్ ఇంజనీ రింగ్ నాకు ఇష్టమైన సబ్జెక్టు. నిట్‌లో అడ్మిషన్ తీసుకోవడం ద్వారా అత్యంత ప్రామాణికమైన విద్యను పొందగలిగా. ఈ విద్యాలయానికి ఎప్పుడూ రుణపడి ఉంటా.

దొడ్డు, సన్న రకం వడ్లను వేర్వేరుగా కొనాలి



బయ్యారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ లెనిన్‌వత్సల్ టొప్పో

బయ్యారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దొడ్డు, సన్నరకం వడ్లను వేరువేరుగా కొనాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో సూచించారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం సూచనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గన్ని సంచులు, టార్పిలిన్స్, ప్యాడిక్లినర్స్ అందుబాటు ఉంచుకోవాలని ఆయన సూచించారు. తేమశాతం వచ్చిన తరువాతే ధాన్యం తీసుకురావాలన్నారు.



ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని కలిసిన ఎంపీ బలరాంనాయక్

రాహుల్‌గాంధీని కలిసిన ఎంపీ బలరాంనాయక్

మహబూబాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీని శుక్రవారం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో కేరళ రాష్ట్రం వయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచిన ప్రియాంకగాంధీకి శుభాకాంక్షలు తెలిపారు.

పలు గ్రామాల్లో ఈజీఎస్ పనుల తనిఖీ

దంతాలపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆగపేటతో పాటు పలు గ్రామాల్లోని జీపీ పరిధిలో జాతీయ ఉపాధి హామీలో భాగంగా చేసిన పనులను శుక్రవారం సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో చేసిన పనులను ఆయా పని ప్రదేశాల్లో క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. మంజూరైన పనులను తనిఖీ చేస్తూ త్వరలో ఓపెన్ ఫోరంలో వివరాలను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అమలు చేస్తాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందచేస్తున్న యశస్వినిరెడ్డి

తొర్రూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ నిరుపేదలను కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు, విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అన్ని మండలాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాలకు చెందిన 163 మంది లబ్ధిదారులకు రూ.56లక్షల 42వేల చెక్కులు అందించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించగా, యశస్వినిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు హమ్యానాయక్, కె.నిరంజన్‌రెడ్డి, రాంచంద్రయ్య, సురేందర్ రెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, సురేష్, కె.నిరంజన్ రెడ్డి,కౌన్సిలర్‌లు, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీధర్‌రెడ్డి, లింగమూర్తి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమానికి పనిచేస్తున్న ప్రభుత్వం'

కేసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రుణమాఫీ, ధాన్యానికి రూ.500ల బోనస్ అందజేసి రైతుల సంక్షేమం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. కేసముద్రం మార్కెట్ ఆవరణలో రైతుల పండుగ కార్యక్రమాన్ని మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను సన్మానించారు. ప్రత్యేక హోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ సభ్యులు చిదిరాల వసంతరావు, వోలం రమేష్, సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, రైతులు గంట దామోదర్‌రెడ్డి, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, పొలెపల్లి చెన్నారెడ్డి, సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల సుధాకర్ పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌ను జయప్రదం చేయాలి : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఈనెల 30, డిసెంబరు 1న నిర్వహించనున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతానికి ఏర్పాటు చేసిన కమిటీల బాధ్యులు ఎవరికి కేటాయించిన బాధ్యతలను వారు తప్పకుండా పాటించి, విద్యార్థులకు, గైడ్ టీచర్లకు ఇబ్బందులు కులుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జీసీడీవోకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఎంఈవోలు మహంకాళి బుచ్చయ్య, వి. బాలాజీనాయక్, ఇస్లావత్ లచ్చిరాంనాయక్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఎస్సెస్సీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సున్నత ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మాలోతు రవీందర్‌చౌకీదార్ పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆర్థికంగా వెనుకబడిన పిల్లలుంటారని వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భూక్యా సిరినాయక్, ఉపాధ్యాయులు కేదాసు వాసుదేవ్, సరిరాం, ప్రతిభ, లత, రామ్మోహన్‌రావు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, డీఈవో

- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



కల్వల మోడల్ స్కూల్లో హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ హాస్టల్‌ను శుక్రవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, జిల్లా విద్యాశాఖాధికారి రవీందరరెడ్డి వేర్వేరుగా పరిశీలించారు. శుక్రవారం 'బాబోయ్ బడి బువ్వ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఉదయమే జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మోడల్ స్కూల్ హాస్టల్‌ను సందర్శించి భోజన నాణ్యతను పరిశీలించారు. వారం రోజులకు సరిపోయే రూ.10 వేల విలువైన సరుకులను మార్కెట్ చైర్మన్ తన సొంతఖర్చులతో సమకూర్చగా డీఈవో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. రాత్రి 20 మంది విద్యార్థినులకు కోసం కిలో ఆలుగడ్డలు, వంద గ్రాముల నూనె కేటాయించినట్లు తెలుసుకొని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డీఈవోకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, హాస్టల్‌లో సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. భోజన నాణ్యత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హాస్టల్ నిర్వాహకులను హెచ్చరించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, గండి శ్రీనివాస్ ఉన్నారు. అంతకు ముందు అన్నారంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

జమా మసీదు పునఃప్రారంభం

గార్ల నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జమా మసీదు శుక్రవారం కమిటీ అధ్యక్షుడు ఎండీ షఫీయొద్దీన్ ఆధ్వర్యంలో ఖమ్మం చెందిన ముఫ్తిలు అసిఫ్‌అలీ, సయ్యద్ ఖాస్మీల పునఃప్రారంభించారు. మసీదు పునః నిర్మాణానికి సహకారం అందించిన ఎండీ అబ్దుల్‌వహిద్‌తో పాటు పలువురు పెద్దలను సత్కరించారు. ఎస్సై జీనత్ కుమార్, గ్రామపెద్దలు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గుండా వెంకట్‌రెడ్డి, మతీరాంనాయక్, కందునూరి శ్రీనివాస్, ముస్లిం మత పెద్దలు షేక్ బేడాన్, రహీంఖాన్, జలాని, యాకుబ్ జాని, ఖదర్‌బాబా, మోహిన్, యాకుబ్ పాష, అజ్జల్, మౌలానా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివలింగ, నందీశ్వర విగ్రహాల ప్రతిష్ఠ

కురవి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కురవిలోని శ్రీరామాలయంలో శుక్రవారం శివలింగం, నందీశ్వరుడు, నాగప్రతిష్ఠ నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు తాటిపాముల నర్సింహామూర్తి, గుడి రాధాకృష్ణమూర్తి, బుక్క వీరన్న, మధు, విజయ్ మంత్రోచ్చరణల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో కర్నాటి మోహన్‌రావు, సకినాల భద్రయ్య, శ్రీరాంప్రకాష్, ఎర్ర నాగేశ్వర్‌రావు, సముద్రాల ప్రకాష్, నూతక్కి నర్సింహారావు, సోమిశెట్టి శ్రీనివాస్, అవిరె మోహన్‌రావు, ఎన్.రాజేందర్‌కుమార్, బాలగాని శ్రీనివాస్, చిన్నం భాస్కర్, నూతక్కి రఘుపతి, నల్లపు వీరన్న పాల్గొన్నారు.

'ప్రభుత్వం న్యాయం చేయాలి'

డోర్నకల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న వారికి న్యాయం చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం మండల నాయకులు కోరారు. డోర్నకల్‌లో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గొర్రెలు, మేకల పెంపకందారులకు న్యాయం చేస్తామని చెప్పి, విస్మరించిందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దాసరి మల్లేశం, మట్టిపల్లి సీతారాములు, రాసమంటి వీరన్న, చెన్ను వెంకటేశ్వర్లు, ఇమ్మడి గోవింద్ పాల్గొన్నారు.

సర్వీస్ రెగ్యూలరైజ్ చేయాలి

కొత్తగూడ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ ఏటూరునాగారం గిరిజన సంక్షేమశాఖలో (ఉమ్మడి వరంగల్ జిల్లా) పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీస్ రెగ్యూలరైజ్ చేయాలని మంత్రి సీతక్కకు టీడబ్ల్యూటీయూ నాయకులు శుక్రవారం కొత్తగూడలో వినతిపత్రం అందజేశారు. గతంలో డీడీ, ఐటీడీఏ పీవో దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదని, డిప్యూటీ డీఈవోకు అప్పగించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వాసం వీరాస్వామి, జనరల్ సెక్రటరీ శం కర్, ఉపాధ్యక్షుడు పూనెం పూర్ణచందర్‌రావు, జిల్లా కార్యదర్శి చుంచ సారయ్య, సెక్రటరీ శ్రీలత, రాజేందర్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్స్ వేతనాలు చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా నాయకుడు ల్యాదెళ్ల రాజు సీతక్కకకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలి

పెద్దవంగర, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ పాఠశాలలో ఉంటున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మెడికల్ ఆఫీసర్ జ్వలిత అన్నారు. శుక్రవారం చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, భోజనశాల, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండాలని విద్యార్థులను కోరారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. డాక్టర్ ఫాతిమా, ఎస్‌వో స్రవంతి, వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ చెట్ల తొలగింపు

మరిపెడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : క్రోనో కార్పస్ చెట్లతో పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి మరిపెడ మోడల్ స్కూల్లోని ఆ చెట్లను సిబ్బందితో శుక్రవారం ప్రిన్సిపాల్ సత్తార్‌పాష తొలగించారు. ఆ స్కూల్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు గణితం పట్ల భయాన్ని వీడాలి



కల్వల హైస్కూల్లో మండలస్థాయి గణితపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డోర్నకల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు గణితం పట్ల భయాన్ని వీడినప్పుడే పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయని డోర్నకల్ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం బండి నర్సింహారావు అన్నారు. శుక్రవారం డోర్నకల్ జడ్పీ హైస్కూల్లో హైస్కూల్‌స్థాయి విద్యార్థులకు మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానంలో సింధూజ, ద్వితీయ స్థానంలో మహేష్, తృతీయ స్థానంలో జశ్వంత్, తెలుగు మీడియంలో ప్రథమ స్థానం జశ్వంత్, ద్వితీయ స్థానంలో వైష్ణవి, తృతీయస్థానంలో అనిల్‌కుమార్ విజేతలుగా నిలిచారు. వారికి హెచ్ఎం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సునీత, రాజేశ్వర్ పాల్గొన్నారు.

- కేసముద్రం : మండలంలోని కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభ పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. డిసెంబర్ 11న మాటేడులో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు వీరు పాల్గొంటారని హెచ్ఎం బండారు నరేందర్ తెలిపారు. ఫోరం బాధ్యులు మాంకాలి యాకాంబ్రం, రాచకొండ యాకాంబ్రం, ఆకుల మధు, మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పెద్దవంగర : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఆయా పాఠశాల విద్యార్థులకు గణిత ప్రతిభ పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. అవుతాపురం హెచ్ఎం కళాధర్, ఉపాధ్యాయులు సురేష్, రాజలిగం, సైదమ్మ, ప్రభాకర్, సదయ్య భాస్కర్, నరసింహారావు పాల్గొన్నారు.
- మరిపెడ : గణిత సబ్జెక్ట్‌పై విద్యార్థులు పట్టు సాధించాలని ఎంఈవో అనితాదేవి అన్నారు. మరిపెడ హై స్కూల్లో గణిత సబ్జెక్ట్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం అనంతరావు, కీసర రమేశ్‌రెడ్డి, రాంమోహన్, యాకయ్య, పవన్, దత్తప్రసాద్, బాబురావు, ప్రసాదరావు, వెంకటయ్య పాల్గొన్నారు.
- గార : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం గార్ల మండల శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి టాలెంట్‌టెస్ట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో మంకిడి వీరభద్రం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గార్ల మండలంలోని 11 జిల్లా పరిషత్ పాఠశాలల్లోని పలువురు విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి ఎం.అనిత, జిల్లా పరిషత్ పాఠశాల పుల్లూరు, ద్వితీయ బహుమతి బి.శ్రావణి పోచారం, తృతీయ బహుమతి ఆర్.సృజన పుల్లూరు పాఠశాలకు చెందిన విద్యార్థులు దక్కించుకున్నారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, మాలోత్ శివనాయక్, ఎం.రామచంద్రు, ఎస్సై జీనత్‌కుమార్, రమేష్, బాలాజీ, వీరభద్రం, సుందర్‌కుమార్, శీలంశెట్టి వెంకటేశ్వర్లు, రామనాథం, పాల్గొన్నారు.

క్రైం కార్నర్



ఆకేరు వాగులో పడిన కారు

- ముగ్గురికి గాయాలు

మరిపెడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పిన కారు మండలంలోని పురుషోత్తామాయగూడెం శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే మహబూబాబాద్ నుంచి సూర్యాపేటకు వైపు వెళ్తున్న కారు వస్తోంది. ఈ క్రమంలో వంతెన వద్ద రెండు నెలల క్రితం వచ్చిన భారీ వర్షానికి వంతెన వద్ద రోడ్డు మరమ్మతులకు గురైన విషయం గమనించపోవడంతో ఒక్కసారిగా కారు గుంతలో పల్టీలు కొట్టి ఆకేరు వాగులో పడింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి.



సేంద్రియ ఎరువును తయారీ చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ మానుకోట

- మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా మునిసిపల్ వాహనాల్లో మాత్రమే వేయాలని ప్రజల భాగస్వామ్యంతో పట్టణాన్ని స్వచ్ఛమానుకోటగా తీర్చిదిద్దుతామని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 26వవార్డు పరిధిలోని సిగ్నల్ కాలనీలో శుక్రవారం డంపింగ్ యార్డును సందర్శించి బయోమైనింగ్ ద్వారా చెత్తను శుద్ధి చేసి సేంద్రీయ ఎరువును తయారీ చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి మునిసిపల్ వాహనాల్లోవేసి సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం 24వవార్డు పరిధిలోని తీగల సత్యనారాయణ నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, దౌలాగర్ శంకర్, మార్నేని కిరణ్ పాల్గొన్నారు.

మహాసభకు హాజరుకావాలి

తొర్రూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు పండుగ (మహాసభ)కు హాజరు కావాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మార్కెట్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొర్రూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని పెద్దవంగర, దంతాలపల్లి, నెల్లికుదురు, తొర్రూరు మండలాల రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు ఉన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

కేసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలోపనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట ఆ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్, మెసెంజర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ భిక్షపతి, సీఆర్‌పీలు ఇస్సంపల్లి ఉదయ్, చీర మురళి, నేరెళ్ల పద్మ, బండారు స్వాతి పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, మహబూబాబాద్ జడ్పీ డిప్యూటీ సీఈవో నర్మద, తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ రవీందర్‌లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్లో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా పెద్దవంగర ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బి.వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శిగా కురవి ఎంపీడీవో వీరబాబు, ఉపాధ్యక్షులుగా మరిపెడ ఎంపీడీవో పి.విజయ, కోశాధికారిగా నెల్లికుదురు ఎంపీడీవో డి.బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కేసముద్రం ఎంపీడీవో క్రాంతి, ఈసీ మెంబర్లుగా వివేక్రాం, రామారావులను ఎన్నికయ్యారు.

'మోసం చేస్తే చర్యలు తప్పవు'

తొర్రూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, విత్తన వ్యాపారులు రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. శుక్రవారం తొర్రూరు క్లస్టర్ పరిధిలోని రైతు వేదికలో వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వ్యాపారాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, వ్యాపారులు మహేష్, వెంకన్న, ఉపేందర్, రాంమ్మూర్తి, రవీందర్ తదితరులు ఉన్నారు.

పోటో :29ఎంబీడీ20-మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు గాంధీపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ సర్వయ్య

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ సర్వయ్య

మహబూబాబాద్‌రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు గాంధీపురం స్టేజీ వద్ద మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య నేతృత్వంలో శుక్రవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలన్నారు. రూరల్ ఎస్సై దీపికరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వేతన భృతి ఇవ్వాలని ధర్నా

- ఆర్డీవోకు వినతి పత్రం అందచేత

తొర్రూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 60లక్షల మంది వ్యవసాయ కూలీలకు వేతన భృతి ఇవ్వాలని కోరుతూ అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తొర్రూరు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడిన కూలీలు పని దొరకక పట్టణాలకు వలస వెళ్తున్నారని, పోలేని కూలీలు అర్ధాకలితో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు రూ.12వేల వేతన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నామని, ఆ ధర్నాకు వ్యవసాయంపై ఆధారపడిన కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఆర్డీవో గణేష్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కేశవులు, రవీందర్, యాకయ్య, రాములు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహిళలు తమ హక్కుల సాధనకై సమరశీల పోరాటాలు నిర్వహించాలని ప్రగతిశీల మహిళ సంఘం పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊకే పద్మ, గుజ్జు కృష్ణవేణి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో శుక్రవారం పీవోడబ్ల్యూ పట్టణ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శివ్వారపు శారద, భట్టు భిన్నమ్మ, పొన్నం రమ, నాగమణి, మౌనిక, అరుణ, ప్రమీల, పద్మ, రాధమ్మ, హైమ, మాధవి, ఈశ్వరమ్మ, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పద్మ

చెకుముకి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో డిసెంబరు 14, 15, 16 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు జిల్లా జట్లు ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక (జేవీవీ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సాహితీ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 28న నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. తెలుగు మీడియం విభాగంలో జడ్పీహెచ్ఎస్ ముల్కలపల్లి, ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విభాగంలో జడ్పీహెచ్ఎస్ చిట్యాల, రెసిడెన్షియల్ విభాగం నుంచి దంతాలపల్లి మహాత్మాజ్యోతిరావుఫూలె గురుకుల పాఠశాల, ప్రవేటు పాఠశాలల విభాగంలో కేసముద్రం వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నేటి బంద్‌ను సక్సెస్ చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగే ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు నాయకులు పట్ల మధు, వెలుగు శ్రావణ్, నాగరాజు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆహారం కలుషితమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటంలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమై బోజనం అందక కలుషితమై ప్రాణాలుపోతున్నాయని పేర్కొన్నారు. సూర్యప్రకాష్, సింహాద్రి, మహేష్, వినోద్, వెంకటేష్ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో డిసెంబరు 1న జిల్లా మహిళా జట్టు ఎంపిక ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్ది వెంకట్‌రెడ్డి, నంద వీరన్న శుక్రవారం తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లోజిల్లాలోని 18 మండలాల పరిధిలోని మహిళా క్రీడాకారిణులు అర్హులన్నారు. 75 కిలోల లోపు బరువు ఉండి ఓపెన్ కేటగిరిలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారిణులు ఆధార్‌కార్డును తీసుకురావాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన జట్టు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో డిసెంబరు 7,8,9,10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 9182948067ను సంప్రదించాలన్నారు.